కథానిక

# కాశ్మీరు శాలువ

సి. పి. గుప్త

దగ్గరౌతున్న కారు శబ్దం, పగటి కలలు కంటూ కూర్చుని వున్న లక్ష్మిని తట్టి మేల్కొల్పింది. క్షణం అద్దం దగ్గరకు పరుగెత్తి వెంట్రుకలు సవరించుకొని ముఖానికంత పౌడరు అద్దుకొని చీరె సవరించుకొంటూ భర్త వున్న గదిలోకి నడిచింది.

డాక్టరు రామారావు, ప్రసాదు చిన్నతనాన్నుండి మంచి స్నేహితులు. వీధి బడినుండి కాలేజీవరకు ఒకటిగా చదువుకున్నారు. గాంధీ మహాత్ముని సహాయ నిరాకరణోద్యమం రోజులలో యిద్దరూ కాలేజి వదిలేసి బయటకు వచ్చి వుద్యమంలో ఉరికారు. ఆరు నెలల కారాగార జీవితం వాళ్ళిద్దరి స్నేహాన్ని దృఢపరచింది.

యిద్దరూ ఆజన్మ బ్రహ్మచారులుగా వుండిపోవాలని, విదేశ విద్యా విధానాన్ని బహిష్కరించాలనీ, తమ జీవితాల్ని ప్రజాసేవ కర్పితం చెయ్యాలనీ జైలులో ప్రమాణాలు చేసుకొన్నారు. కాని యిద్దరూ కూడ ఆ ప్రమాణాల్ని పూర్తిగా ఆచరణలో పెట్టలేకపోయారు.

ప్రసాదు విడుదలైన కొద్దిరోజులకల్లా తల్లికి జబ్బుచేసింది. చావుబతుకుల్లోవున్న తల్లి ప్రసాదు ఒకింటివాడైతే చూచిపోవాలని పట్టుపట్టింది. తల్లికి నచ్చచెప్పేందుకు ఎంత ప్రయత్నం చేసినా సార్థకం లేకపోయింది. చివరకి ప్రసాదు తన మేనమామ కొమార్తె లక్ష్మిని వివాహం చేసుకోక తప్పిందికాదు. కాని ప్రసాదు మళ్ళీ కాలేజిలో చేరేందు కిష్టపడలేదు. కాలేజి జీవితం అంతటితో పూర్తయింది.

రామారావును మళ్ళీ కాలేజిలో చేరమని తండ్రి బలవంతం చేశాడు. జాతీయోద్యమం నడుపుతున్న పెద్ద పెద్ద నాయకులందరూ విదేశీయ విద్యావిధానంలో తయారయినవారేనని చెప్పాడు. గాంధీమహాత్ముని లాంటి పెద్ద నాయకులంతా విదేశాలలో చదువుకొని వచ్చిన వాళ్ళేనని నచ్చచెప్పాడు. పైగా తనతో జైలుకు వెళ్ళిన విద్యార్థులు చాలామంది తిరిగి కాలేజిలో చేరారు. సహాయ నిరాకరణోద్యమం కూడ ముగిసింది. చివరకు రామారావు వైద్య విద్య చదివి డాక్టరు వృత్తితో ప్రజాసేవ చేసేందుకు అంగీకరించాడు.

సాంఘిక పరిస్థితుల్లోనూ విద్యలోనూ వాళ్ళిద్దరి మధ్య ఎంతో తారతమ్యం వున్నప్పటికీ వాళ్ళ స్నేహానికేమీ భంగం కలిగిందికాదు. ఇద్దరూ బాల్యంలో ఎలావున్నారో అటువంటి స్నేహితులుగానే వుండిపోయారు. కాని చేస్తున్న వైద్యవృత్తి కారణంగా డాక్టరా పట్నంలోని ప్రజలకు చాల సన్నిహితుడైనాడు. పురపాలక సంఘంలో మెంబరుగా కూడా ఎన్నుకోబడ్డాడు. ప్రసాదు మాత్రం ఎప్పటి మాదిరిగానె ఒక బీద కాంగ్రెసు సేవకుడుగా వుండిపోయేడు.

డాక్టరు గదిలోకి ప్రవేశించగానే లక్ష్మి లోపలకు పరుగెత్తింది. కొత్తగా కొన్న ఆ ఎర్రని కాశ్మీర్ శాలువలో, నలుపైనప్పటికీ డాక్టరు ఆకర్షణీయంగా కనపడ్డాడు లక్ష్మి కళ్ళకు. డాక్టరు చూపులు తనని పరిశోధిస్తున్నట్లు భావించింది. ఒళ్ళంతా జలదరించింది.

“ఈ కాశ్మీర్ శాలువ నిన్ననే కొన్నాను. ఎలావుంది” అంటూ అడిగాడు డాక్టరు ప్రసాదుని.

“చాలా బాగావుంది.”

“దాని క్వాలిటీని బట్టి చూస్తే ధరేమంత ఎక్కువగాదు. ఇంతా దాని వెల నూటయాభై రూపాయలే” అన్నాడు డాక్టరు.

“నూటయాభై రూపాయలు ఎక్కువ కాదంటావా!” ఆశ్చర్యంగా అన్నాడు ప్రసాదు. కోటానకోట్ల బీదప్రజలు తిండిలేక ఎలా అల్లాడుతున్నారో, ఆ శాలువకు గాను వెచ్చిం

(తరువాయి 34వ పేజీలో)

(16వ పేజీ తరువాయి)

-చిన ధనంతో ఒక కుటుంబం ఒక నెలపర్యాంతం ఎలా జీవించవచ్చో చెప్పాడు. డాక్టరు తప్పు చేసిన వాడికిమల్లే ఫీలయ్యాడు, తాను చేసిన ప్రమాణాన్ని నిలుపుకోలేక పోయానని. ఐశ్వర్యంతో తులతూగుతూ బీదవాళ్లసంగతే మరచిపోతున్నానని అనుకొన్నాడు.

వీళ్ళిద్దరి మధ్య సంభాషణ లక్ష్మికెంతమాత్రం రుచించడం లేదు. ఎంతో ఉత్సాహంగా ఇంటికి వచ్చిన డాక్టరుతో బీదవాళ్లంటూ దేశమంటూ వేదాంతం మాట్లాడి నిరుత్సాహపరచే భర్తపైన కోపం వచ్చింది ఆలోచించడం ప్రారంభించింది. ఎప్పుడూ కోపంగా ఏమో ఆలోచిస్తూ నిరుత్సాహంగా కనపడే తన భర్తలో డాక్టర్ని ఆకర్షించేందు కేమున్నది గనక! డాక్టరు పదే పదే రావడం ప్రసాదుతో స్నేహం కోసమేనా? లేక తనకోసమా? తన్నాసించాడా? ఎందుకు కాగూడదు? వెంటనే డాక్టరు వాళ్ల యింట్లో అడుగు పెట్టడం తోనే తనవైపు చూచిన చూపులు జ్ఞాపకం వచ్చినవి. ఎంత ఆశతో చూచాడు? ఎందుకు తనవైపలా చూడటం? అద్దం దగ్గరకెళ్ళి తన ముఖాన్ని అటూ యిటూ తిప్పి చూసుకుంది డాక్టరు చూచినప్పుడు తాను ఆకర్షవంతంగా వున్నానా లేదా అనే సందేహంతో. నగలు నాణ్యాలేవీ లేకపోయినా ఆకర్షణీయంగానే కనిపించింది. ఇంకా యిప్పుడేముంది? తన హైస్కూల్లో చదువుకొనేటప్పుడు తనవెంట ఎప్పుడూ నలుగు రైదుగురు విద్యార్థులు తిరుగుతూనే వుండేవాళ్లు. తన సౌందర్యానికి గర్వపడింది.

కొత్త సంవత్సరం పెట్టకముందే పంటలు కొయ్యడం గింజలు అమ్మేసి డబ్బు చేసుకోవడం అయిపోతుండేవి. ప్రతి సంవత్సరం ప్రసాదు దగ్గిర బంధువొకడు గ్రామంలో ప్రసాదుకున్న భూమిలో పండిన పంటను అమ్మేసి డబ్బు పంపుతుండేవాడు, ఉగాదికి ఒక నెలరోజులుముందే పైకం చేరుతుండేది. కాని ఆ సంవత్సరం ఎందుచేతనో ఆలస్యమయింది. పండగ వచ్చి వాకిట్లో కూచుంది యీ లోపల డబ్బు వచ్చేటట్లు కనిపించలేదు. పండగఖర్చుకు చేతిలో పైసాలేదు. ఖర్చు తగ్గించుకుందుకు ఎంత ప్రయత్నించినా తప్పనిసరి ఖర్చులు కొన్ని వున్నవి.

ఎలాగైతేనేం డాక్టర్ని అప్పు అడిగేందుకు ప్రసాదు అంగీకరించక తప్పిందికాదు. ఇంతకు ముందెప్పుడూ తాను దమ్మిడీ అడిగినవాడు కాదు. మొదట పోగూడదనుకొన్నా పరిస్థితుల వత్తిడివల్ల పోక తప్పిందికాదు. ఆ సాయంత్రం డిస్పెన్సరీకి వెళ్ళాడు.

ఆలోచనా పరంపరలతో మునిగి తేలుతూ కూర్చుంది లక్ష్మి. డాక్టర్ని తాను వివాహమాడివుంటే తన జీవితం ఎలా వుండివుండేదో వూహించుకుందుకు ప్రయత్నించింది. తన సౌందర్యం యౌవనం అప్పుడిలా వృథా అయ్యుండేవి కావు. ప్రసాదును చూస్తే తనకు జాలి తప్ప మరో భావం కలగడంలేదు. నిజానికి ప్రసాదు చాలా మంచివాడు. కాని అతని మనస్తత్వం లక్ష్మికి రుచించలేదు. కోరికలను చంపుకోవడం అందరికీ చేతనైన పనికాదు. పాంచభౌతికమైన యీ ప్రపంచంలో నివసిస్తూ భౌతిక వాంఛల కతీతంగా వుండటం సాధ్యం కాదు. లక్ష్మి హృదయంలో కొత్తకోరిక లుదయించినవి, నరాల్లోని రక్తం వేడెక్కింది

లక్ష్మియొక్క ఆలోచనా ప్రవాహానికి ఆనకట్ట కట్టింది బయట వినిపించిన కారు శబ్దం. డాక్టరు వస్తున్నాడు ప్రసాదు యింట్లో లేనప్పుడు. హృదయం వేగంగా కొట్టుకోవడం ప్రారంభించింది. కారు యింటిముందు ఆగింది. పగటి కలలుకంటూ కూర్చునివున్న లక్ష్మి చీకటి పడిన విషయం గుర్తించలేదు. దీపం ముట్టించనందున అంతా చీకటిమయంగా వుంది. మినుకు మినుకు మంటున్న నక్షత్ర కాంతిలో ఎర్రని కాశ్మీరు శాలువ మాత్రం కనిపించింది. వెంటనే లక్ష్మిలో ఒక నూతన అనుభూతి కలిగింది. ద్వారం దగ్గరకు పరుగెత్తి తన రెండు చేతులు అతని మెడకు పెనవేసి గట్టిగా కౌగలించుకొంది. "ఆయన యిప్పుడే మీదగ్గరకు వెళ్ళాడు. మీరు సరైన సమయంలో వచ్చారు" అంటూ వుధృతంలో ఏమో గొణిగింది

"డాక్టరు చాల మంచివాడు. ఈ శాలువ నాకు వుగాది కానుకగా యిచ్చి తీసుకొనే వరకు వేధించాడు. నీ కొక చీరగూడ పంపాడు" అన్నాడు ప్రసాదు తెల్లబోతున్న లక్ష్మితో.